వర్ష బీభత్సం

పలు జిల్లాలు జలమయం ➤ స్తంభించిన జనజీవనం

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం మధ్యాహ్నం నుండి సోమవారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. తిరునల్వేలి, తూత్తుకుడి, సేలం సహా ఐదు జిల్లాలు జలమయమయ్యాయి. తిరుప్పూరు జిల్లాలో కురిసిన కుండపోత వర్షాలకు అమరావతి డ్యామ్ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరింది. తిరునల్వేలి జిల్లాలోని పశ్చిమకనుమల ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. మణిముత్తారు జలాశయం పరివాహక ప్రాంతాల్లో సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. జిల్లాలోని చేరన్‌మాదేవి, ముక్కూడల్, మూలైకారైపట్టి చుట్టుపక్కలి ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుంచి వర్షాలు కురిశాయి. తెన్‌కాశి జిల్లాలోనూ ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు వర్షం కురిసింది. శంకరన్‌కోవిల్, శివగిరి, వాసుదేవనల్లూరు, వలంపురి వినాయకస్వామి ఆలయ ప్రాంతం తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి.

సేలంలో...

సేలం జిల్లాలో వారం రోజులుగా రాత్రి పూట వర్షాలు కురుస్తున్నాయి. ఆ నేపథ్యంలో ఆదివారం కురిసిన కుండపోత వర్షాని సేలం కొత్త బస్‌స్టేషన్ ప్రాంతంలో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదేవిధంగా సేలం ఫోర్‌వే, ఫైవ్‌వే, పాత బస్టాండు ప్రాంతం, కొండలాంబట్టి జంక్షన్, అమ్మాపేట, కిచ్చిపాళయం, నారాయణ నగర్, పచ్చపట్టి, నెత్తిమేడు, అన్నదానపట్టి, తాత్తాపట్టి తదితర ప్రాంతాల్లో, ప్రధాన వీధుల్లో మోకాలిలోతున వర్షపునీరు ప్రవహించింది. పచ్చపట్టి, అమ్మాపేట, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చొరబడింది. సేలం గాంధీ క్రీడామైదానం ప్రాంతం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. సేలం సీలనాయక్కన్‌పట్టికి చెందిన సుబ్రమణి అనే వ్యక్తికి చెందిన పెంకుటిల్లు భారీ వర్షాలకు కూలి పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్ళి శిథిలాలలను తొలగించారు. ఏర్కాడులోనూ ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు భారీ వర్షం కురిసింది. జిల్లాలో అధికంగా ఏర్కాడులో 79మి.మీ.ల వర్షం కురిసింది.



తిరునల్వేలిలోని ఓ వీధిలో వరదలా ప్రవహిస్తున్న వర్షపు నీరు



సేలంలో కురుస్తున్న వాన

తూత్తుకుడిలో...

తూత్తుకుడి జిల్లాలోనూ కయిత్తారు, కడంబూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ప్రారంభమైన వర్షాలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. దీంతో పల్లపు ప్రాంతాలు దీవులుగా మారాయి. కోవిల్‌పట్టి, ఇలయరసనేందల్ ప్రాంతంలోని రైల్వే సొరంగమార్గంలో సోమవారం ఉదయం మోకాలు లోతున వర్షపునీరు



కొడైకెనాల్ రహదారిలో కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న కార్మికుడు

తిరుప్పూరులో..

తిరుప్పూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు వాతావరణం చల్లబడింది. తిరుప్పూరు నగరం, సబర్బన్ ప్రాంతాల్లో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. ఈ నెలా మొదటలో కురిసిన భారీ వర్షాలకు ఉడుమలై వద్దనున్న అమరావతి డ్యామ్‌లో నీటి మట్టం బాగా పెరిగింది. ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షాలకు 90 అడుగుల సామర్థ్యం ఉన్న ఆ డ్యామ్‌లో నీటిమట్టం 88.88 అడుగులకు పెరిగింది. దీంతో అదనపు జలాలను విడుదల చేయడానికి జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు సోమవారం ఉదయం పరిశీలించారు.

కొడైకెనాల్‌లో...


ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా భారీగా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. అన్నాసాలై, మూంజిక్కల్, ఏరిచ్చాలై తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. సోమవారం ఉదయం

ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో వెళ్లాల్సిన వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో నడిపారు. కళగుమలై ప్రాంతంలో సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఆ వర్షానికి విద్యుత్ సరఫరా కూడా ఆగిపోవటంతో ప్రజలు అవస్థలపాలయ్యారు.

ఏరిచ్చాలై రహదారిలో, మూలక్కడై - తాండిక్కుడి ఘాట్‌రోడ్డులో భారీ వృక్షాలు కూలాయి. దీంతో ఆ మార్గంలో ఇరువైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి. హైవే అధికారులు హుటాహుటిన కార్మికులతో వెళ్లి ఆ వృక్షాలను తొలగించారు. ఈ సంఘటన కారణంగా నాలుగు గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



పచ్చపట్టి ప్రాంతంలో ఇళ్లలోకి చొరబడిన వర్షపు నీరు



నిండుకుండలా ఉన్న మెట్టూరు డ్యాం

మెట్టూరు డ్యాంకు జలకళ

● రెండోసారి నిండిన జలాశయం

అడయార్, ఆగస్టు 12: సేలం జిల్లాలోని మెట్టూరు రిజర్వాయర్ ఈ యేడాదిలో వరుసగా రెండోసారి నిండింది. ఈ జలాశయంలోకి సెకనుకు 26 వేల ఘనపుటడుగుల నీరు వస్తోంది. దీంతో ఈ యేడాది వరుసగా రెండోసారి పూర్తి కెపాసిటీ 120 అడుగులకు చేరింది. ఈ డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కర్నాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆ రాష్ట్రంలోని జలాశయాల నుంచి నీటికి కిందికి విడుదల చేస్తున్నారు. దీంతో ఆదివారం ఉదయం 20,505 ఘనపుటడుగుల నీరు డ్యాంలోకి చేరుతుండగా, సోమవారానికి 26 వేల ఘనపుటడుగులకు చేరింది. దీంతో డ్యామ్ పూర్తి కెపాసిటీ 120 అడుగులకు చేరింది. డ్యాం పూర్తిగా నిండటంతో ఈ నెల 7వ తేదీ నుంచి నిలిపివేసిన నీటి విడుదలను మళ్ళీ ప్రారంభించారు. కావేరీ డెల్టా ప్రాంతాల్లో సాగునీరు, జల విద్యుత్ ఉత్పత్తి కోసం 21500 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్ నీటిమట్టం 120 అడుగులుండగా, రిజర్వాయర్‌లో 93.47 టీఎంసీల నిల్వ ఉంది. ఈ రిజర్వాయర్‌కు వచ్చే నీరు పెరుగుతుండటం, అలాగే, డ్యామ్ నుంచి నీటిని కిందికి విడుదల చేస్తుండటంతో కావేరీ నది ఒడ్డుకు ఇరువైపుల ఉండేవారిని ఖాళీ చేయిస్తున్నారు. డ్యామ్ నీటి మట్టాన్ని ప్రజాపనుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కొత్తగా నాలుగు కార్పొరేషన్లు

● సీఎం చేతుల మీదుగా ప్రారంభం





నీటి సరఫరా సంస్థ, చెన్నై మెట్రోవాటర్ బోర్డ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగర పంచాయితీల చట్టం 1998 ప్రకారం కొత్తగా ఏర్పాటైన తిరువణ్ణామలై, పుదుకోట, నామక్కల్, కారైక్కుడి కార్పొరేషన్లకు సచివాలయంలో నగరపాలక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీకారం చుట్టారు. చారిత్రకనగరం పుదుకోట, ఆలయాల నగరం తిరువణ్ణామలై, పారిశ్రామిక నగరం నామక్కల్, విద్యానగరం కారైక్కుడి మున్సిపాలిటీలను కార్పొరేషన్ స్థాయికి పెంచాలని ఆ నాలుగు నగరాల ప్రజలు యెన్నో యేళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ మేరకు ఆ నాలుగు మున్సిపాలిటీలకు సమీపంలో ఉన్న పంచాయితీలను కలిపి కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని మార్చి 30న జరిగిన శాసనసభ సమావేశంలో నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ప్రకటించారు. ఆ తర్వాత ఆ నాలుగు కార్పొరేషన్ల రూపకల్పనకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ఆదేశాలు కూడా జారీ చేశారు.

ఆ ప్రకారం పుదుకోట మున్సిపాలిటీలో 11 నగర పంచాయతీలను విలీనం చేసి పుదుకోట కార్పొరేషన్‌గా, తిరువణ్ణామలైలో 18 నగర పంచాయతీలను, దిగువ అణ్ణామలై ప్రాంతాలను కలిపి తిరువణ్ణామలై కార్పొరేషన్‌గా, నామక్కల్‌లో 12 నగర పంచాయతీలను విలీనం చేసిన నామక్కల్ కార్పొరేషన్‌గా, కారైక్కుడిలో రెండు పట్టణ పంచాయతీలు, ఐదు నగర పంచాయతీలను విలీనం చేసి కారైక్కుడి కార్పొరేషన్‌గా రూపొందించారు. ఈ నాలుగు కొత్త కార్పొరేషన్లను సీఎం ప్రారంభించారు.

రూ.769.97 కోట్లతో పథకాల ప్రారంభం...

రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక, తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో రూ.769.97 కోట్లతో పూర్తయిన 103 పథకాలకు సీఎం స్టాలిన్ ప్రారంభోత్సవం చేశారు. అదే విధంగా 1192.45 కోట్లతో చేపట్టనున్న 30 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర నీటి సరఫరా సంస్థ, చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులకోసం కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. సచివాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలు ప్రాజెక్టులను వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, ప్రజాపనుల శాఖ మంత్రి ఈవీ వేలు, సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్, జీసీసీ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ దయానిధి మారన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శివదాస్ మీనా, నగరపాలక తాగునీటి సరఫరా శాఖ ముఖ్య కార్యదర్శి డి. కార్తికేయన్, చెన్నై మెట్రోవాటర్ బోర్డు కమిషనర్ కుమారగురుబరన్, రాష్ట్ర నీటి సరఫరా సంస్థ ఎండీ. వి.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయకళాశాల భవనం ప్రారంభం..

ఇదే విధంగా న్యాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పలుభవనాలను ప్రారంభించారు. రూ.76.60 కోట్లతో నిర్మించిన రామనాథపురం న్యాయ కళాశాల భవనం, హాస్టల్ భవనాన్ని తిరువళ్లూరు జిల్లా పట్టరైపెరుంబుదైరులోని అంబేడ్కర్ న్యాయకళాశాల ప్రాంగణంలో రూ.1.57 కోట్లతో నిర్మించిన ఫుట్‌బాల్ మైదానం, బ్యాడ్మింటన్ మైదానాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. న్యాయశాఖ మంత్రి ఎస్. రఘుపతి, న్యాయశాఖ కార్యదర్శి సి. జార్జి అలెగ్జాండర్, న్యాయవిద్య సంచాలకులు జే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామనాథపురం న్యాయకళాశాల భవన సముదాయాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న స్టాలిన్

జాతీయ పతాకావిష్కరణను అడ్డుకుంటే గూండా చట్టం

● మద్రాసు హైకోర్టు హెచ్చరిక

పెరంబూర్, ఆగస్టు 12: జాతీయ పతాకావిష్కరణ అడ్డుకుంటే గూండా చట్టం కింద అరెస్ట్ చేయాలని మద్రాసు హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకం ఎగురవేసే కార్యక్రమాన్ని అడ్డుకొనేందుకు కొందరు యత్నిస్తున్నారని, అందువల్ల ఈ కార్యక్రమం సజావుగా సాగేలా పోలీసు భద్రత కల్పించాలని మద్రాసు హైకోర్టులో నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తి జయచంద్రన్ విచారించారు. అనంతరం న్యాయమూర్తి... జాతీయ పతాకాన్ని ఎగురవేయడాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. జాతీయ పతాకావిష్కరణకు పోలీసు భద్రత కల్పించడం అవమానకర విషయమని తెలిపారు. అలాగే, జాతీయ పతాకావిష్కరణను అడ్డుకొనే వారిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించాలని ఆదేశించిన న్యాయమూర్తి, పోలీసులు తగిన చర్యలు చేపట్టకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు.

ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఏర్పాట్లు ముమ్మరం

● మంత్రి పీకే శేఖర్‌బాబు

అడయార్, ఆగస్టు 12: రాష్ట్రంలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం పళని దండాయుధపాణి ఆలయం వద్ద ఈ నెల 24, 25వ తేదీల్లో మురుగన్ భక్తుల కోసం 'ముత్తమిళ్ మురుగన్ మహానాడు'ను దేవాదాయ శాఖ నిర్వహించనుంది. ఆ మహానాడు ఏర్పాట్లను దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు సోమవారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ మహానాడులో భాగంగా, ఆరుపడై వీడు పేరుతో స్టాల్స్ ఏర్పాటు, ఫొటో ఎగ్జిబిషన్, త్రీడీ సాంకేతికతతో స్టూడియో, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంతో పాటు మలేసియా, సింగపూర్, భారత్‌లోని ఇతర రాష్ట్రాలకు చెందిన మురుగన్ భక్తులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మురుగాండియార్ పేరుతో 15 అవార్డులు అందజేయనున్నారు. మహానాడు ఉదయం 8.30కి ప్రారంభమై, మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు జరగనుంది. ఈ మహానాడులో మొత్తం ఎనిమిది వేల మంది భక్తులు పాల్గొనవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు ఆహార శాఖామంత్రి చక్రపాణితో కలిసి ఈ మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు.



మహానాడు ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

మా నాయకత్వాన్ని అంగీకరిస్తేనే అన్నాడీఎంకేతో పొత్తు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ సీట్ల కోసం యాచించే స్థితిలో లేదని, పార్టీలకు సీట్లను కేటాయించే స్థాయిలో ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై స్పష్టం చేశారు. తిరుప్పూరులో పార్టీ మండలస్థాయి నాయకులు, పార్టీ శ్రేణుల సమావేశం జరిగింది. తాను విదేశాలకు వెళ్తుండటంతో తన స్థానంలో మరొకరికి పార్టీ పదవి అప్పగించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకత్వాన్ని అంగీకరిస్తే అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకోవడానికి తమకెలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 28న ఉన్నత విద్య కోసం లండన్ వెళ్తున్నానని, మూడు నెలల తర్వాత నవంబర్ 16న రాష్ట్రానికి తిరిగి వస్తానని చెప్పారు. అప్పటివరకూ పార్టీలోని సీనియర్ నాయకులు, ప్రముఖులు సమష్టిగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోవు రోజులు పార్టీకి అత్యంత కీలకమైనవని స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీజేపీకి 600 మందికిపైగా ప్రతినిధులు ఉన్నారని, ఈ సంఖ్య రెట్టింపు కావటం తథ్యమన్నారు. ఇక 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ ఏర్పడే అవకాశం ఉందన్నారు. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో కొత్త పార్టీలు చేరే అవకాశాలున్నాయని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులు అన్ని వీధుల్లో జాతీయ పతకాలను ఆవిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నవంబర్‌లో లండన్ నుంచి తాను తిరిగొచ్చాక 234 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను నియమించనున్నామని అన్నామలై తెలిపారు.





తిరుప్పూరు సభలో బీజేపీ కార్యకర్తలతో శపథం చేయిస్తున్న అన్నామలై

సమాచార దర్శిని

రూ.2 కోట్లతో పార్కుల అభివృద్ధి

ఐసిఎఫ్, ఆగస్టు 12: తాంబరం కార్పొరేషన్ పరిధిలో ఉన్న 28 పార్కులను రూ.2 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 4వ మండలంలో 68 పార్కులున్నాయి. వాటిలో అధ్వాన్నంగా ఉన్న 28 పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు కార్పొరేషన్ నిర్ణయించింది. ఫౌంటెన్లు, పిల్లల క్రీడా మైదానం, సందర్శకులు కూర్చునేందుకు సీట్లు, విద్యుద్దీపాలు, వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలు కల్పించనున్నామని, ఈ పనులు సెప్టెంబరులో పూర్తవుతాయని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఆగస్టు 12: స్థానిక అన్నాసాలై, అన్నానగర్, గిండి, పొన్నేరి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. అన్నాసాలై పరిధిలోని వారు చింతాద్రిపేట ఇంజనీర్ కార్యాలయం, అన్నానగర్ పరిధిలో అదే ప్రాంతంలోని ఇంజనీర్ కార్యాలయం, గిండి పరిధిలో నంగనల్లూర్ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణం, పొన్నేరి పరిధికి చెందిన వారు వేంబాక్కం ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణాల్లో నిర్వహించే శిబిరాల్లో వినియోగదారులు పాల్గొని, విద్యుత్ మీటరు, విద్యుత్ బిల్లులు, కొత్త కనెక్షన్, ఇతర సమస్యలకు పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

రూ.86 లక్షలతో ఆస్పత్రి భవనం

ఐసిఎఫ్, ఆగస్టు 12: స్థానిక కోయంబేడు ప్రాంగణంలో వ్యాపారులు, కార్మికుల కోసం రూ.86 లక్షలతో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోంది. ఈ మార్కెట్లో 4,000లకు పైగా దుకాణాలున్నాయి. వ్యాపారులు, కార్మికులు 20,000 మందికి పైగా పనిచేస్తున్నారు. వీరి కోరిక మేరకు ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.86 లక్షలతో ఆస్పత్రి భవన నిర్మాణపనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాదిలోగా ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని మార్కెట్ నిర్వాహకులు తెలిపారు.

ఆవిన్ నెయ్యిపై రూ.10ల రాయితీ

పెరంబూర్, ఆగస్టు 12: కృష్ణ జయంతి, వినాయక చవితి తదితర పండుగల సందర్భంగా 100 మి.లీ నెయ్యి ప్యాకెట్లపై రూ.10 తగ్గిస్తున్నట్లు ఆవిన్ సంస్థ ప్రకటన విడుదల చేసింది. ఆవిన్ సంస్థ పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, పన్నీర్, ఐస్‌క్రీమ్ సహా పలురకాల పాల ఉత్పత్తులు ఆవిన్ పార్లర్లు, చిల్లర దుకాణాల ద్వారా విక్రయిస్తోంది. పండుగల సందర్భంగా ప్రజల సౌకర్యార్థం పాల ఉత్పత్తులపై రాయితీ ప్రకటిస్తోంది. ఆ ప్రకారం కృష్ణ జయంతి (ఈ నెల 26వ తేది), వినాయక చవితి (సెప్టెంబరు 7వ తేది) సందర్భంగా నెయ్యి ధరలపై రాయితీ ప్రకటించింది. ఆ ప్రకారం, రూ.85కు విక్రయమవుతున్న ఆవిన్ 100 మి.లీ నెయ్యి ధర రూ.75గా తగ్గించింది. ఈ ప్రత్యేక రాయితీ సెప్టెంబరు 15వ తేది వరకు అమలులో ఉంటుందని ఆవిన్ తెలిపింది.


పంద్రాగస్టుకు 9,000 మందితో బందోబస్తు

పెరంబూర్, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజధాని నగరంలో 9,000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజున జార్జికోటలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జాతీయ పతాకం ఎగురవేసి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా జార్జికోట, పరిసర ప్రాంతాల్లో ఐదంచెల భద్రత ఏర్పాటుచేశారు. అలాగే, విమానాశ్రయం, రైల్వేస్టేషన్, బస్ టెర్మినళ్లు, బీచ్, ప్రార్థనా స్థలాల వద్ద భద్రత కల్పించనున్నారు. లాడ్జీలు, మాన్షన్స్, హోటల్స్‌లో తనిఖీలు చేస్తున్నారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ ఎ.అరుణ్ ఉత్తర్వులతో అడిషనల్ కమిషనర్ (సౌత్) ఎస్.కన్నన్, అడిషినల్ కమిషనర్ (ట్రాఫిక్) ఆర్.సుధాకర్, అడిషినల్ కమిషనర్ (నార్త్) కేఎస్ నరేంద్ర నాయర్ పర్యవేక్షణలో డిప్యూటీ కమిషనర్లు, ఎస్ఐ, సబ్ ఇన్స్‌పెక్టర్లు, పోలీసులు, హోంగార్డ్స్ అని మొత్తం 9,000 మంది భద్రత విధుల్లో పాల్గొంటారని గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వాషర్‌మెన్‌పేటలో రౌడీ దారుణహత్య

అడయార్, ఆగస్టు 12: స్థానిక తండయారుపేట, బాలకృష్ణన్ వీధిలో ఓ రౌడీ దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడిని ఎర్నావూర్, సత్యమూర్తి నగర్ వరదరాజపెరుమాళ్ వీధికి చెందిన లోకేష్ (32)గా గుర్తించారు. ఈయనపై తిరువొత్తియూరు, తండయారుపేట, కాశీమేడు, న్యూ వాషర్‌మెన్‌పేట తదితర పోలీస్ స్టేషన్లలో అనేక కేసులున్నట్టు పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి తండయారుపేట, బాలకృష్ణన్ వీధిలోని ఓ కుటుంబ సభ్యులతో లోకేష్ గొడవపెట్టుకున్నాడు. ఆ తర్వాత ఆయనపై ఓ రౌడీ ముఠా దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లోకేష్ అక్కడికక్కడే మరణించాడు. వాషర్‌మెన్‌పేట పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాత కక్షల కారణంగానే లోకేష్‌ను గుర్తు తెలియని రౌడీలు హత్య చేసి వుంటారని భావిస్తున్నారు. పరారీలో ఉన్న రౌడీల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

18న కరుణ సెంటినరీ స్మారక రూ.100 నాణెం విడుదల



పార్యీస్, ఆగస్టు 12: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వార్షికోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆయన రూపంతో రూ.100 నాణెం ముద్రించింది. ఈ నెల 18వ తేది సాయంత్రం 6.50 గంటలకు స్థానిక ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలో ఉన్న కలైవానర్ అరంగంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన నాణెం విడుదల కార్యక్రమం జరుగనుంది. ముఖ్యఅతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని 'ముత్తమిళ్ అరింజర్, కలైంజర్ శత స్మారక రూ.100 నాణెం' విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, తమిళ సినిమా అగ్రహీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్ తదితర ప్రముఖులను ప్రభుత్వం ఆహ్వానించింది. అదే విధంగా రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని సచివాలయం ప్రకటించింది.



తిరుపత్తూర్ జిల్లా ఎస్పీగా సోమవారం పదవీ బాధ్యతలు చేపడుతున్న శ్రేయా గుప్తా

పురావస్తు పరిశోధనలో బయల్పడిన రాతియుగం నాటి పనిముట్లు

ఐసిఎఫ్, ఆగస్టు 12: కోయంబత్తూర్ జిల్లా మోలపాళయం ప్రాంతంలో తమిళ విశ్వవిద్యాలయం నిర్వహించిన పురావస్తు పరిశోధనల్లో కొత్త రాతియుగం పనిముట్లు లభ్యమయ్యాయి. ఈ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ సెల్వకుమార్ నేతృత్వంలో మోలపాళయంలో 2021లో పురావస్తు పరిశోధనలు జరిగాయి. ఈ విషయమై సెల్వకుమార్ మాట్లాడుతూ... నడి వయస్సు మహిళ, 3 నుంచి 7 ఏళ్లలోపున్న పిల్లల అస్థిపంజరాలు, పశువులు, మేకల అస్థిపంజరాలు, రోళ్లు, రోకళ్లు, ధాన్యం విత్తనాలు, రాతి గొడ్డళ్లు, కొత్త రాతియుగం నాటి కుండలు, సముద్రపు శంఖాలతో చేసిన దండలు, ధాన్యం సేకరణ పాత్రలు వంటివి కనుగొన్నామన్నారు. ఈ ప్రాంతంలో లభించిన మాంసపు ముక్కను అమెరికాలో ఉన్న బీటా ల్యాబ్‌కు పంపించి కాలాన్ని నిర్ధారించగా, 3,200 నుంచి 3,600 ఏళ్ల క్రితం జీవించిన మనుషులు ఆహారానికి వినియోగించిన ఎండు మాంసంగా గుర్తించారన్నారు. జూన్‌లో చేపట్టిన పరిశోధనల్లో భూమిలో 80 నుంచి 140 సెం.మీ అడుగున కొత్త రాతియుగం నాటి పనిముట్లు లభించాయన్నారు. వీటితో పాటు మూడు సానపట్టిన రాతి గొడ్డళ్లు లభించాయని, మృతదేహాలను భద్రపరిచే శవ



పేటికలు కూడా కనుగొన్నామని తెలిపారు. ప్రస్తుతం లభ్యమైన వస్తువులను ప్రయోగశాలకు పంపించి వాటి కాలాలు నిర్ధారించనున్నామని తెలిపారు.చి

రాణిపేట సీఎంసీ విస్తరణకు భూమిపూజ

వేలూరు, ఆగస్టు 12: రాణిపేట సీఎంసీ ఆస్పత్రి విస్తరణకు భూమి పూజ సోమవారం జరిగింది. ఈ విషయమై సీఎంసీ అసోసియేట్ డైరెక్టర్ డా.దీపక్ సెల్వరాజ్, సీఎంసీ డైరెక్టర్ డా.విక్రమ్ మోహదీవ్ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డా.దీపక్ సెల్వరాజ్, డా.విక్రమ్ తదితరులు

1928లో డా.ఇడ ఎస్.స్కడర్ అనాథ పిల్లల కోసం ప్రారంభించిన ఆస్పత్రి విస్తరించారన్నారు. అనంతరం 1958లో కొత్త భవనాలు ఏర్పాటుచేయగా, 1970లో మరింత అభివృద్ధి చేశారని తెలిపారు. 2000లో ఆస్పత్రి స్వర్ణోత్సవాలు జరుపుకున్నామన్నారు. ప్రస్తుతం 1.4 లక్షల మంది ఔట్ పేషంట్లు, 6,300 మంది ఇన్‌పేషంట్లకు చికిత్స అందుతున్నట్టు తెలిపారు. అన్ని రోగాలకు మెరుగైన చికిత్సలందించేలా అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

సెంథిల్ బాలాజి బెయిలు కేసు తీర్పు వాయిదా

పార్యీస్, ఆగస్టు 12: బెయిలు కోరుతూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజి దాఖలుచేసిన కేసులో ఇరుతరఫు వాదనలు ముగిసిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు తీర్పు తేది ప్రకటించకుండా వాయిదా వేసింది. రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన సమయంలో అక్రమ నగదు బట్వాడా కేసులో సెంథిల్ బాలాజీని పోలీసులు అరెస్ట్ చేశారు. తనను బెయిలుపై విడుదల చేయాలని కోరుతూ సెంథిల్ బాలాజి పలు మార్లు దాఖలుచేసిన పిటిషన్లను పలు న్యాయస్థానాలు తోసిపుచ్చాయి. ఈ నేపథ్యంలో, బెయిలు కోసం సెంథిల్ బాలాజి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం జరిగిన విచారణలో ప్రభుత్వ తరపున న్యాయవాది నియమించే అంశంపై న్యాయవాదులు వాదించారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న దస్తావేజులన్నింటినీ ఈడీ అధికారులు సవరించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. ఇరుతరపు వాదనలు ముగిసిన నేపథ్యంలో, సెంథిల్ బాలాజి కేసు తీర్పును తేది ప్రకటించకుండా న్యాయస్థానం వాయిదావేసింది.

'తంగలాన్' రిలీజ్‌కు ముందే రూ.కోటి డిపాజిట్ చేయాలి

● నిర్మాతకు హైకోర్టు ఆదేశం

అడయార్, ఆగస్టు 12: చియాన్ విక్రమ్ హీరోగా నటించిన 'తంగలాన్' చిత్రం విడుదలకు ముందే కోటి రూపాయలను డిపాజిట్ చేయాలని ఆ చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజాకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. నగరానికి ప్రముఖ ఫైనాన్షియర్ అర్జున్‌లాల్ సుందర్‌దాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. గతంలో అర్జున్‌లాల్ అనేక మందికి రుణాలు ఇవ్వగా పలువురు తిరిగి చెల్లించలలేదు. దీంతో తాను దివాళా తీసినట్టు ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన సహజమరణం చెందారు. ఆయన ఆస్తులను మద్రాస్ హైకోర్టు ఆధీనంలోకి వెళ్ళగా, అర్జున్‌లాల్ నుంచి రుణాలు తీసుకున్న వారి నుంచి కొంత మొత్తాన్ని దశలవారీగా వసూలు చేస్తుంది. ఈ క్రమంలో నిర్మాత జ్ఞానవేల్ రాజా కూడా రూ.10.35 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాలని హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీన్ని విచారించిన కోర్టు... జ్ఞానవేల్ నిర్మించిన తంగలాన్ చిత్రం విడుదలకు ముందే కోటి రూపాయలను డిపాజిట్ చేయాలని ఆదేశించారు.

18 వరకు సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 12: సబర్బన్ రైళ్ల సేవల రద్దును మరో నాలుగు రోజులు పొడిగిస్తూ దక్షిణ రైల్వే సోమవారం ప్రకటన విడుదల చేసింది. తాంబరం రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా గత నెల నుంచి చెన్నై బీచ్-తాంబరం మధ్య సబర్బన్ రైళ్ల సేవల్లో మార్పులు చేశారు. ఈ పనులు ముగిసి ఈ నెల 14వ తేది నుంచి యథావిధిగా రైళ్లు నడుస్తాయని ప్రకటించిన నేపథ్యంలో, మరో నాలుగు రోజులు ఈ నెల 18వ తేది వరకు రైళ్ల సేవల్లో మార్పులు కొనసాగనున్నాయి. అలాగే, విల్లుపురం-తాంబరం (06028), విల్లుపురం-మేల్‌మరువత్తూర్ (06727), మేల్‌మరువత్తూర్-చెన్నై బీచ్ (06722), పుదుచ్చేరి-చెన్నై ఎగ్మూర్ (06026), చెన్నై ఎగ్మూర్-పుదుచ్చేరి (06025), చెన్నై బీచ్-మేల్‌మరువత్తూర్ (06721), మేల్‌మరువత్తూర్-విల్లుపురం (06725), తాంబరం-విల్లుపురం తదితర రైళ్ల సేవలు ఈ నెల 15 నుంచి 17వ తేది వరకు పూర్తిగా రద్దు చేశారు. అలాగే, చెన్నై బీచ్ నుంచి నడిపే సబర్బన్ రైళ్లు పల్లావరం వరకు, చెంగల్పట్టు నుంచి నడిపే రైళ్లు గుడువాంజేరిలో నిలిపివేయనున్నారు. ఈ నెల 18వ తేది మధ్యాహ్నం 12 గంటల నుంచి రైళ్ల సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. సబర్బన్ రైళ్ల సేవల మార్పులో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు రైళ్లు నడపాలని ఎంటీసీకి లేఖ రాసినట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది

ప్రభుత్వ కళాశాల ముట్టడి

పార్యీస్, ఆగస్టు 12 : తిరువళ్లూరు జిల్లా పొన్నేరి నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాలను కాంగ్రెస్ శాసనసభ్యుడు దురై చంద్రశేఖర్ సోమవారం తన అనుచరులతో కలిసి ముట్టడించారు. పొన్నేరి ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో కామరాజర్ పోర్ట్ ఆధ్వర్యంలో రూ.5.25కోట్లతో కొత్తగా



నల్లజెండాలతో పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్

నిర్మించిన తరగతి గదులను సోమవారం ఆ పోర్ట్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి సునీల్‌పాలీవాల్ ప్రారంభించారు. అయితే స్థానిక శాసనసభ్యుడైన దురై చంద్రశేఖర్‌ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోగా, ఆహ్వానపత్రికలో, అలాగే శిలాఫలకంలో కూడా ఆయన పేరు లేకుండా చేశారు. దీంతో దురై చంద్రశేఖర్ తన అనుచరులతో కలిసి ఆ కళాశాలముట్టడికి పాల్పడ్డారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీ నిలిపివేత

పెరంబూర్, ఆగస్టు 12: కావేరి నదిలో ప్రవాహం అధికంగా ఉండడంతో హొగెనేకల్ వద్ద దోనెల సవారీని జిల్లా యంత్రాంగం రద్దు చేసింది. కర్ణాటక లోని డ్యాంల నుంచి కావేరి నదిలోకి విడుదల చేస్తున్న అదనపు జలాలు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పిల్లిగుండ్లు మీదుగా హొగెనేకల్‌కు చేరుకుంటాయి. అక్కడ వరద ప్రవాహం అధికంగా ఉండడంతో సుమారు 20 రోజులకు పైగా నిలిపివేసిన దోనెల సవారీ, వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మూడు రోజుల క్రితం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, సోమవారం హొగెనేకల్ వద్ద వరద ప్రవాహం పెరగడంతో దోనెల సవారీ రద్దు చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

తాంబరం కార్పొరేషన్‌లో సమస్యలపై అన్నాడీఎంకే ధర్నా



ధర్నాలో అన్నాడీఎంకే నేతలు బెంజమిన్, టీకేఎం చిన్నయ్య తదితరులు

పార్యీస్, ఆగస్టు 12: తాంబరం కార్పొరేషన్‌లో పారిశుధ్యలోపం, మురుగునీరు కలిసిన తాగునీటి సరఫరా తదితర ప్రజాసమస్యలను పరిష్కరించలేదంటూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పల్లావరం రైల్వేస్టేషన్ సమీపంలో పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి చిట్లపాక్కం రాజేంద్రన్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో మాజీ మంత్రులు పి.బెంజిమెన్, టీకేఎం చిన్నయ్య సహా పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే గణిత సంపత్, కౌన్సిలర్ సేలయూర్ శంకర్, పార్టీ అనుబంధ విభాగాల కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆ వయసు మహిళల్లో అరుదైన గుండెపోటు

● ఎస్ఆర్ఎంసీ ఛైర్మన్ ఎస్.తనికాచలం

అడయార్, ఆగస్టు 12: ఇటీవలికాలంలో 50 నుంచి 60యేళ్ళ వయసున్న మహిళల్లో అరుదైన గుండెపోటు అధిక రక్తపోటు వస్తున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ఎంసీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.తనికాచలం, కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నాగేంద్ర భూపతి సూచించారు. ఈ విషయంపై వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా ఊబకాయం, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, స్మోకింగ్, వ్యాయామం లేకపోవడం వంటి వాటివల్ల గుండె రక్తనాళాల్లో రక్తప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటం సహజం. ఈ క్రమంలో 60 యేళ్ళ వయసున్న ఓ మహిళ ఎస్ఆర్ఎంసీలో అత్యవసర విభాగంలో అడ్మిట్ అయ్యారు. ఆమె మెడికల్ రిపోర్టులు పరిశీలించిన వైద్యులు.. అంతా సవ్యంగానే ఉందని వెల్లడించారు. మరుసటిరోజు ఉన్నట్టుండి తీవ్రమైన నొప్పి వచ్చిందని, దీన్ని స్పాంటేనియస్ కరోనరీ ఆర్టరీ డిసెక్షన్ (ఎస్‌సీఏడీ) అని పేర్కొంటారని, అధిక రక్తపోటు, మానసిక ఒత్తిడికారణంగా ఈ తరహా నొప్పి వచ్చినట్టు గుర్తించారు.

మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

వేలూరు, ఆగస్టు 12: మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. స్థానిక ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం మత్తుపదార్థాల నిర్మూలన



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, కార్పొరేషన్ మేయర్ సుజాత, యూనియన్ కమిటీ అధ్యక్షులు అముద జ్ఞానశేఖరన్, జిల్లా తహసీల్దార్ కవిత, ఏఎస్పీ తిరునావుక్కరసు, ప్రిన్సిపాల్ శ్రీధరన్, మండల కమిటీ అధ్యక్షులు నరేంద్రన్, యూనిఫ్‌ఖాన్, పోలీసు ఇన్స్‌పెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. అదే విధంగాజిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక కోట సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నుంచి ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, ఏఎస్పీ తిరునావుక్కరసు, ఎక్సైజ్ కమిషనర్ మురుగన్, వేలూరు తహసీల్దార్ మురళీధరన్, పలుపాఠశాలలకు చెందిన సుమారు 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో పీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

అడయార్, ఆగస్టు 12: ఫ్రూడెల్ హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫ్రూడెల్ ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) పేరుతో, క్రికెట్, వాలీబాల్ టోర్నీ ఈ నెల 11 నుంచి ప్రాంభమైంది. అనేక జట్లు పాల్గొనే ఈ టోర్నీలో భాగంగా ఈ నెల



జెర్సీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

15, 18, 25, సెప్టెంబరు 8, 15, 22, 29, అక్టోబరు 6, 13 తేదీల్లో వివిధ ప్రాంతాల్లో మ్యాచ్‌లను నిర్వహిస్తారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీని ఫ్రూడెల్ హాస్పిటాలిటీ సర్వీసెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మదన్ మోహన్ రాజ్ ప్రారంభించారు. వండలూరులోని ఈశ్వర్ అకాడెమీలో మ్యాచ్‌లను నిర్వహిస్తారు. పూర్తి వివరాల కోసం ఆర్గనైజర్ కార్తీక్‌ను 91764 11244 అనే నంబరులో సంప్రదించవచ్చని ఫ్రూడెల్ హాస్పిటాలిటీ సర్వీసెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 12: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పోరూర్: తంగం అవెన్యూ, మూకాంబిగై నగర్, ఈశ్వరర్ నగర్, వీఎస్ నగర్, పొన్నియమ్మన్ నగర్, సాయి నగర్, తిల్లై నటరాజర్ నగర్, మధురా గార్డన్

తాంబరం: మదనపురం, కలైంజర్ వీధి, ముడిచూర్ మెయిన్ రోడ్డు, ఎస్కే అవెన్యూ, పార్క్ వీధి, కేకే రోడ్డు, అంబేడ్కర్ వీధి, ముత్తుమారియమ్మన్ ఆలయ వీధి, స్వామి నగర్, వెంకటాద్రి నగర్, ఏఎల్ఎస్ గ్రీన్ ల్యాండ్, బాలాజీ నగర్, ఈబీ కాలనీ, భరత్ నగర్, లింగం నగర్, కొల్లపురి అమ్మన్ ఆలయ వీధి, వెస్ట్ లక్ష్మీ నగర్, భారతి అవెన్యూ, చిత్ర అవెన్యూ, బాలాజి నగర్, కురింజి నగర్, కాకా భుజేందర్ నగర్, కామరాజర్ హైరోడ్డు, శఠగోపన్ నగర్

రామాపురం: మనపాక్కం, మొగలివాక్కం, కొలపాక్కం, నెసపాక్కం, రామాపురం, ఎంజీఆర్ నగర్, వెంకటేశ్వర నగర్, ఐపీఎస్ కాలని, భూదపేడు, రామచంద్ర నగర్, జై బాలాజి నగర్, ఖాన్ నగర్, కేకే పొన్నురంగం రోడ్డు

పెరంబూర్: మాధవరం హైరోడ్డు, పీబీ రోడ్డు, రాఘవన్ వీధి, ఎస్సార్పీ ఆలయ ఉత్తర, దక్షిణ మాడవీధులు, తీడ్స్ గార్డన్ 1 నుంచి 7 వీధులు, పటేల్ నగర్, పెరంబూర్ మొత్తం, ఎస్బీఐ కాలని, పళని ఆండవర్ ఆలయ వీధి

చిట్లపాక్కం: వరదరాజ పెరుమాళ్ ఆలయ వీధి, ఏటీపీ అవెన్యూ, వేంగైవాసల్ మెయిన్ రోడ్డు, సీపీఎల్, చిట్లపాక్కం, వెంబ అవెన్యూ, టీఎన్‌హెచ్‌బీ కాలని, కన్నికోయిల్ వీధి, ఎంజీఆర్ నగర్, పరిసల్ నగర్, వివేకానంద నగర్, నూకంపాళయం రోడ్డు, జయనగర్, వళ్లువర్‌నగర్, గాంధీనగర్, ఒట్టియంబాక్కం, అరసన్‌కలని మెయిన్‌రోడ్డు, కరనై మెయిన్‌రోడ్డు, శంకరాపురం, నాగలక్ష్మీనగర్, ఒట్టియంబాక్కం, నేసమణినగర్, నూకంపాళయం రోడ్డు, మల్లీస్ అపార్ట్‌మెంట్స్, కేజీ అపార్ట్‌మెంట్స్, ఆర్పీ అపార్ట్‌మెంట్స్ కైలాష్ నగర్, వరదాపురం, చెట్టినాడు విల్లా, సౌమ్య నగర్

అన్నానగర్: బి నుంచి జడ్ బ్లాక్‌లు, జి బ్లాక్, వసంతం కాలని, ఉదయం కాలని, ఐశ్వర్య కాలని, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఆర్బీఐ క్వార్టర్స్, సీబీడబ్ల్యూడీ క్వార్టర్స్, పొన్ని కాలని, బెల్లి ఏరియా, తంగం కాలని, జయంతి కాలని, రంగనాథన్ గార్డన్, టవర్ వ్యూ కాలని, గార్డన్ వ్యూ అపార్ట్‌మెంట్స్, అన్నానగర్ ఈస్ట్ పోలీస్ ఏసీ క్వార్టర్స్, విజయశ్రీ మహల్, అంబేడ్కర్ నగర్, ప్రభుత్వాసుపత్రి, ఎం, ఎన్ బ్లాక్‌లు, అన్నై సత్యా నగర్, రాయల్ ఎన్‌క్లేవ్

రాయపేట: పీటర్స్ రోడ్డు, డా.బీసెంట్ రోడ్డు, హాస్సెన్ నగర్ 1 నుంచి 5 వీధులు, రామస్వామి మేస్త్రి వీధి, సుబ్బరాయ చెట్టి వీధి, పొన్నప్ప చెట్టి వీధి, మాణిక్య మేస్త్రి వీధి, నీర్‌భక్షిఅలి వీధి, ఎక్స్‌టెన్షన్, మొహమ్మద్ హస్సెన్ వీధి, నాయర్ వరదపిళ్లై వీధి, పెరుమాళ్ మొదలి వీధి, రామస్వామి గార్డన్ వీధి, సీఎస్ దురైస్వామి కాలని, తలారి వీధి, డా.నియమతుల్లా వీధి, దేవరాజ్ వీధి, ఇరుసప్పన్ వీధి, గెజెటిబేగం వీధి, హాజీ షేక్ హస్సెన్ వీధి, జానీజానీఖాన్ రోడ్డు 1 నుంచి 5 వీధులు, కంభం దర్వాజ వీధి, కరీమ్ సుబేదార్ వీధి, ముజాఫర్ జెన్ బహదూర్ వీధి, పల్లియప్పన్ వీధి, సూరప్పన్ వీధి, షేక్ దావూద్ వీధి, షర్హుద్దీన్ గార్డన్ వీధి, తీర్థప్పం వీధి, తంబునాయకన్ వీధి, నెసవాలర్ వీధి, తిరునావుక్కరసర్ వీధి, సర్దార్ జంగ్ గార్డన్ వీధి, ఆర్మగ ఆచారి వీధి, అంగముత్తు వీధి, అగత్తిముత్తన్ వీధి, చిన్నప్పరావుత్తర్ వీధి, జనరల్ స్వామినాయగన్ వీధి, కబీర్ సాహెబ్ వీధి, కేఎంఏ వీధి, అయ్యాస్వామి వీధి, గౌయ్యా అరుణగిరి వీధి.

సైబర్ క్రైం పోలీసులమంటూ రూ.3.30 లక్షల మోసం

పెరంబూర్, ఆగస్టు 12: సైబర్ క్రైం పోలీసులమంటూ ఆన్‌లైన్‌లో ఇద్దరిని రూ.3.30 లక్షలకు మోసం చేసిన ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. స్థానిక ఎంజీఆర్ నగర్ సమీపం నెసపాక్కం ప్రాంతానికి చెందిన గిరిధర్ వట్టపళని ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఆయనకు వీడియో కాల్ చేసిన ఓ ఓ వ్యక్తి, తాను ముంబై సైబర్ క్రైం విభాగం నుంచి మాట్లాడుతున్నానని, ఈరోన్ దేశానికి మీ పేరుతో పంపిన పార్శిల్స్‌లో సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ తదితర విలువైన పరికరాలున్నాయని, ఈ వ్యవహారంలో అరెస్ట్ చేయకుండా ఉండాలంటే వెంటనే ఈ నెంబరు డబ్బులు పంపాలని బెదిరించాడు. దీంతో భయాందోళన చెందిన గిరిధర్ ఆ వ్యక్తి చెప్పిన నెంబరుకు 'గూగుల్ పే' ద్వారా ఆరు విడతలుగా రూ.2.30 లక్షలు పంపించాడు. అనంతరం కూడా ఆ వ్యక్తి ఫోన్ చేసి డబ్బులు అడుగుతుండడంతో అనుమానించిన గిరిధర్, ఆ వ్యక్తి పేరు, చిరునామా తదితర వివరాలు కోరగా వెంటనే అతను ఫోన్ కట్ చేశాడు.ఈ విషయమై గిరిధర్ ఎంజీఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, చూలైమేడుకు చెందిన కృష్ణారావు వద్ద కూడా అదే ముఠా, రూ.లక్ష వరకు వసూలుచేశారు. ఈ రెండు కేసులపై పోలీసులు విచారణ చేపట్టారు.

23 ఏళ్ళుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడి అరెస్టు

అడయార్, ఆగస్టు 12: గత 23 యేళ్ళుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడుని పోలీసులు అరెస్టు చేశారు. తిరుమంగళం ప్రాంతానికి చెందిన కన్నన్ (32) అనే వ్యక్తి తోపుడుబండిపై అరటిపళ్ళ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 2000లో కారులో వచ్చిన ఆరుగురు వ్యక్తులు ఆయనపై దాడి చేసి అరటిపళ్ళను దోచుకుని పారిపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కన్నన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు.. చెట్‌పేట్‌కు చెందిన విజయకుమార్ (49) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ తర్వాత బెయిల్‌పై వచ్చాడు. అయితే, ఈ కేసు విచారణ సమయంలో మరో కేసులో ఆయన గత 23 యేళ్ళుగా కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నట్టు తేలింది. దీంతో కోర్టు ఆదేశం మేరకు విజయకుమార్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించారు.

ఆడిటోరియం నిర్మాణానికి భూమిపూజ



వేలూరు, ఆగస్టు 12: ఆనైకట్టు నియోజకవర్గం పులిమేడులో ఆడిటోరియం నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. డీఎంకే జిల్లా సెక్రటరీ, ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కమిటీ అధ్యక్షుడు అముద జ్ఞానశేఖరన్, ఉపాధ్యక్షులు మహేశ్వరి కాశి, యూనియన్ సెక్రటరీ జ్ఞానశేఖరన్, ఉప సెక్రటరీ కాశి, కౌన్సిలర్ కుమార్, పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వ్యాపారంలో నష్టం: దంపతుల బలవన్మరణం

పార్యీస్, ఆగస్టు 12: నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపంలో వ్యాపారంలో ఏర్పడిన నష్టాన్ని తట్టుకోలేక భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు... వేదారణ్యం సమీపంలో ఉన్న సెంబగరాయనల్లూర్ ప్రాంతానికి చెందిన కుమరేశన్ (35)భువనేశ్వరి (30) దంపతులు ఆ



భువనేశ్వరి-కుమరేశన్ (ఫైల్‌ఫోటో)

ప్రాంతంలో కిరాణా దుకాణం నడుపుతూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం తెల్లవారుజామున ఇంటి మిద్దెపై వారు శరీరమంతా కాలి శవాలుగా పడి ఉండడాన్ని పక్కింటివారు చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, మృతదేహాలు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి ప్రాథమిక విచారణలో.. కుమరేశన్‌కు వ్యాపారంలో నష్టం వచ్చిందని, అందువల్ల భార్యాభర్తలు మనస్తాపానికి గురై ఇంటి మిద్దెపై ఉన్న విద్యుత్ తీగను పట్టుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

1145 కిలోల గంజాయి దహనం

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మాదకద్రవ్యాల నిరోధక చర్యల్లో భాగం గా తంజావూరు సెంట్రల్ జోన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1145 కేజీల గంజాయిని డీఐజీ జియావుల్‌హక్ దహనం చేశారు. సెంట్రల్ జోన్ పరి



గంజాయి పొట్లాన్ని విద్యుత్ దహన యంత్రంలో వేస్తున్న డీఐజీ జియావుల్ హక్

ధిలోని తిరుచ్చి, పెరంబలూరు, తిరువారూరు, కరూరు, అరియలూరు, తంజావూరు, నాగపట్టినం, పుదుకోట, మైలాడుదురై జిల్లాలో పట్టుబడిన గంజాయిని మూటలుగా కట్టి సోమవారం ఉదయం వల్లం సమీపం అయోధ్యపట్టిలో ఉన్న ఓ కర్మాగారానికి పోలీసులు తీసుకెళ్లి అక్కడున్న భారీ యంత్రాల్లో గంజాయి బస్తాలు వేసి వాటిని కాల్చేశారు.. ఆ తర్వాత పోలీసులందరి చేత డీఐజీ జియావుల్‌హక్ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.

మాజీ మంత్రిపై పరువు నష్టం దావా రద్దు

పార్యీస్, ఆగస్టు 12: అన్నాడీఎంకే నేత సీవీ షణ్ముగంపై నమోదైన పరువు నష్టం కేసును రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2022లో విల్లుపురం జిల్లాలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న సీవీ షణ్ముగం, ముఖ్యమంత్రి స్టాలిన్ గౌరవ ప్రతిష్ఠలు దెబ్బతీసే విధంగా మాట్లాడారని స్థానిక డీఎంకే నేతలు దిండివనం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు వ్యతిరేకంగా దాఖలైన పరువు నష్టం కేసును రద్దు చేయాలని కోరుతూ సీవీ షణ్ముగం హైకోర్టులో పిటిషన్ వేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జయచంద్రన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ఆ సమయంలో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది జాన్‌సత్యన్ హాజరై, సీవీ షణ్ముగం ప్రసంగం వల్ల శాంతి భద్రతలకు భంగం కలిగి ఉన్నట్లయితే రాష్ట్రప్రభుత్వమే ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని అయితే, డీఎంకే కార్యకర్తలు రాజకీయ కోణంలో పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారని వాదించారు. ఈ కేసులో ఇరుతరఫు వాదనల అనంతరం, సీవీ షణ్ముగం ప్రసంగాన్ని న్యాయస్థానం సమర్థించలేదని అయితే, ఘర్షణ వాతావరణం ఏర్పడే విధంగా ఆయనపై కేసు నమోదుచేయడం సాధ్యామేనా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇందుకు పోలీసు శాఖ తరఫు న్యాయవాది కేఎంటీ మొగిలిన్, బహిరంగ సభలో సీవీ షణ్ముగం మాట్లాడిన విధానం రెండు వర్గాల మధ్య ఘర్షణలు రెచ్చగొట్టే విధంగా ఉందని, అందువల్లే ఆయనపై పరువు నష్టం కేసు దాఖలుచేసినట్లు వివరించారు. షణ్ముగంపై వేరే సెక్షన్ కింద కేసు నమోదుచేయనున్నట్లు న్యాయవాది మొగిలిన్ తెలిపారు. ఈ కేసులో ఇరుతరఫు వాదనలు పూర్తయిన నేపథ్యంలో, సీవీ షణ్ముగంకు వ్యతిరేకంగా దాఖలైన కేసు రద్దు చేస్తూ న్యాయమూర్తి జయచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు.

5,979 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, ఆగస్టు 12: ఈ నెల 9వ తేది సోలార్ విద్యుదుత్పత్తి 5,979 మెగావాట్ల మేర జరిగింది. మార్చి 3వ తేది గరిష్ఠంగా 5,398 మెగావాట్ల ఉత్పత్తి జరిగింది. జూలై 24న 5,512 మెగావాట్లు, ఈ నెల 2వ తేది 5,704 మెగావాట్లు ఉండగా, 9వ తేది 5,979 మెగావాట్లకు విద్యుదుత్పత్తి పెరిగింది.

గన్ పాయింట్‌లో రౌడీ అరెస్టు

అడయార్, ఆగస్టు 12: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు ప్రతీకారం తీర్చుకునేందుకు అదును కోసం వేచిచూస్తున్న మురుగేశన్ అనే రౌడీని పోలీసులు గన్‌పాయింట్‌లో అరెస్టు చేశారు. ఈ రౌడీకి మడిప్పాక్కం సెల్వం, రెడ్‌హిల్స్ పార్తీవన్ తదితరుల హత్య కేసులతో సంబంధం ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో విచారణలో భాగంగా, ఈ కేసుతో సంబంధం ఉన్న వారి కోసం ప్రత్యేక పోలీసుల బృందం గాలిస్తోంది. ఈ క్రమంలో రౌడీముఠా నేతగా చెలామణి అవుతున్న మురుగేశన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించగా ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు ప్రతీకారం తీర్చుకునేందుకుగాను అదునుకోసం వేచి చూస్తున్నట్టు వెల్లడించాడు. ఆయనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నకిలీ నగలతో రూ.5 లక్షల మోసం

పెరంబూర్, ఆగస్టు12: నకిలీ నగలను చూపించి రూ.5 లక్షలకు మోసం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వెస్ట్‌మాంబళంకు చెందిన కిరాణా దుకాణయజమాని కుమారస్వామిని కలిసిన ఇద్దరు వ్యక్తులు, తమ వద్ద బంగారు ఆభరణాలున్నాయని, అవసరంగా తక్కువ ధరకు విక్రయిస్తామని తెలిపారు. అలాగే, తమ వద్ద ఉన్న బంగారు నగలను కుమారస్వామికి చూపారు. వారి మాటలు నమ్మిన ఆయన రూ.5 లక్షలు ఇచ్చి నగలు తీసుకున్నాడు. వారు వెళ్లిన తర్వాత నగలు పరీక్షించగా అవి నకిలీ విగా గుర్తించి మోసపోయినట్లు తెలుసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి, క్రోంపేట రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన బాబూలాల్ రాథోర్, రాహుల్‌ను అరెస్ట్ చేశారు.

చిత్రజ్యోతి


దివ్య దురైస్వామి

విమల్ సరసన ఇద్దరు భామలు

నటుడు విమల్ సరసన ఇద్దరు హీరోయిన్లు నటించనున్నారు. వీరిలో ఒకరు దివ్య దురైస్వామి కాగా, మరొకరు 'బిగ్‌బాస్' పావని ఉన్నారు. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించిన విమల్‌కు ఇటీవలి కాలంలో సరైన హిట్ లేదు. కానీ, ఓ వెబ్‌సిరీస్ మాత్రం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తాజాగా 'ఎంగిట్ట మోదాదే' చిత్ర దర్శకుడు రాము చెల్లప్ప డైరెక్షన్‌లో రూపుదిద్దుకుంటున్న వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నారు. ఇందులో ఇద్దరు హీరోయిన్లను ఎంపిక చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. త్వరలోనే హాట్‌స్టార్ ఓటీటీలో విడుదలకానుంది.

మరణించిన వారు మళ్ళీ జన్మిస్తారా?

● 15న 'డిమాంటి కాలనీ-2' రిలీజ్

మరణించిన వారు మళ్ళీ జన్మిస్తారా? అనే పాయింట్‌ను ఆధారంగా చేసుకుని 'డిమాంటి కాలనీ-2' సినిమా తీశామని ఆ చిత్ర దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు అన్నారు. అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ హీరోహీరోయిన్లుగా నటించగా, అరుణ్‌పాండ్యన్, మీనాక్షి గోవిందరాజన్, అర్చన, ముత్తుకుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని నిర్మాతలు బాబీ బాలచంద్రన్, విజయసుబ్రమణియన్, ఆర్‌సీ రాజ్‌కుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 15న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం నగరంలో మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు మాట్లాడుతూ, 'ఇది 2015లో వచ్చిన హార్రర్ డ్రామా 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్. తొలి భాగంలో అందులోని వారంతా చనిపోతారు. ఆ క్లైమాక్స్‌లో వదిలేసిన చిన్న పాయింట్ ఆధారంగా చేసుకుని ఈ సినిమా రూపొందించాం. చనిపోయిన మనసుషులు మళ్ళీ జన్మిస్తారా? అన్నది ప్రధాన పాయింట్. తొలి భాగం స్టోరీకి ముందు ప్రీ సీక్వెల్ ఉంటుంది. దానికి, ఇపుడు రెండో భాగానికి లింక్ చేస్తూ ఈ సీక్వెల్ కొనసాగుతుంది' అన్నారు. హీరో అరుళ్‌నిధి మాట్లాడుతూ, 'ఇందులోని దెయ్యం సినిమాల్లో ఇప్పటివరకు చూసిన దెయ్యంలా ఉండదు. కొత్త అనుభూతిని కలిగించే దెయ్యం. ఎంతో భయానకంగా సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్‌గా స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది' అన్నారు. హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. సినిమా చాలా బాగావచ్చింది. మీడియా సపోర్ట్ చేయాలి' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ, 'ఈ నెల 15వ తేదీన తమిళనాడులో 300కు పైగా స్క్రీన్లలో రెడ్ జెయింట్ మూవీస్, అమెరికా, మలేసియా, సింగపూర్ తదితర దేశాల్లో టెంట్‌కొట్టాయ్ రిలీజ్ చేస్తుంది' అని తెలిపారు.


'డిమాంటి కాలనీ-2'లో అరుళ్‌నిధి - ప్రియా భవాని

సమస్యల పరిష్కారానికి నిర్మాతల సంఘంతో చర్చలు

● నడిగర్ సంఘం నిర్ణయం


సమావేశంలో పాల్గొన్న నడిగర్ సంఘ కార్యవర్గ సభ్యులు

తమిళ చలనచిత్ర నిర్మాతల మండలితో ఉన్న విభేదాలు, మనస్పర్థలను తొలగించుకునేందుకు చర్చలు జరుపుతామని నడిగర్ సంఘం వెల్లడించింది. ఈ నెల 16 నుంచి కొత్త సినిమాల ప్రారంభంపై తాత్కాలిక నిషేధం విధించడం, నవంబరు ఒకటో తేదీ నుంచి కోలీవుడ్‌లో అన్ని షూటింగులు నిలిపివేయడం, హీరో ధనుష్‌తో కొత్తగా సినిమాలేవీ నిర్మించరాదంటూ తీర్మానం చేయడం వంటి అంశాలను నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం నడిగర్ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో నిర్మాతల మండలి చేసిన పలు తీర్మానాలను ఖండించారు. అంతేకాకుండా, హీరో ధనుష్‌పై నిర్మాతల సంఘం చేసిన ఆరోపణలు తోసిపుచ్చింది. ధనుష్ అంశంలో నడిగర్ సంఘానికి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై నాజర్, విశాల్, కార్తీ సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ, 'తమిళ చిత్రపరిశ్రమను ఉన్నతస్థాయికి చేర్చాలన్నదే తమ ఆశయం. ఇందుకోసం కొన్ని మంచి నిర్ణయాలు తీసుకున్నాం. వాటిని నిర్మాతల సంఘానికి తెలియజేస్తాం. కొందరు నటీనటుల గురించి నిర్మాతలు ఫిర్యాదు చేయడం, వాటికి తాము జవాబు ఇవ్వడం సర్వసాధారణమన్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుందామని నిర్మాతల సంఘం అధ్యక్షుడు లేఖ రాయగా, మేము కూడా ఓ తేదీ వెల్లడించామని, త్వరలోనే సమావేశమై అన్ని రకాల సమస్యలను పరిష్కరించుకుంటాం' అని తెలిపారు.

అద్భుతమైన విజువల్స్‌తో 'కంగువా' ట్రైలర్

స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం 'కంగువా'. చిరుత్తై శివ దర్శకుడు. మూవీ ట్రైలర్ సోమవారం రిలీజ్ చేశారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్ సహా ఏకంగా పదికి పైగా భాషల్లో రూపుదిద్దుకుంటుంది. దసరా కానుకగా అక్టోబరు 10వ తేదీ విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విడుదల చేసిన ట్రైలర్ మైండ్‌బ్లోయింగ్ విజువల్స్‌తో కట్ చేశారు. ఇందులో సూర్యతో పాటు హీరోయిన్ దిశా పటానీ, ప్రతి నాయకుడు బాబి డియోల్ తమ యాక్టింగ్‌తో అందరగొట్టేశారు. ఈ ట్రైలర్ ఓ మహిళ వాయిస్‌తో మొదలవుతుంది. సూర్య డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. ట్రైలర్ మొత్తం ఆకట్టుకునేలా ఉంది. బాబి డియోల్, సూర్య డైలాగులు, దేవీశ్రీ ప్రసాద్ సంగీతం ఇలా అన్ని అంశాలు హైలెట్‌గా నిలిచింది. దీంతో ఈ సినిమాపై ఒక్కసారిగా భారీ అంచనాలు పెరిగిపోయాయి. యూవీ క్రియేషన్స్‌తో కలిసి కేఈ జ్ఞానవేల్ రాజా స్టూడియో గ్రీన్ పతాకంపై భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా విజువల్స్, మూవీ గ్లింప్స్, సాంగ్స్, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన వచ్చిన విషయం తెల్సిందే.


'కంగువా'లో బాబి డియోల్ - సూర్య

డ్రగ్స్ రహిత సమాజం కోసం సమష్టి పోరాటం

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన సీఎం ● పోలీసులకు 'సీఎం పతకాలు'



నగరపాలక , నీటి సరఫరా శాఖల్లో ఉద్యోగాలు పొందిన 144 మంది అభ్యర్థులు, కారుణ్య ప్రాతిపదికన నియామక ఉత్తర్వులు అందుకున్న 27 మందితో సీఎం స్టాలిన్, మంత్రి నెహ్రూ తదితరులు - ముఖ్యమంత్రి చేతుల మీదుగా పతకాలు అందుకున్న మాదక ద్రవ్యాల నిరోధించటంలో విశేష ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు

అడయార్, ఆగస్టు 12: మాదకద్రవ్య రహిత (డ్రగ్స్) సమాజం (తమిళనాడు) కోసం కృషి చేద్దామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన విద్యార్థులు, పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, మాదకద్రవ్య నిర్మూలనకు విశేష కృషి చేసిన పోలీసులు, పోలీస్ ఉన్నతాధికారులకు ఆయన 'చీఫ్ మినిస్టర్స్ స్పెషల్ మెడల్స్' అందజేశారు. తమిళనాడు రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం చెప్పాక్కంలోని మద్రాస్ విద్యాలయం ఆడిటోరియంలో 'డ్రగ్స్ రహిత తమిళనాడు' అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్టాలిన్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత తమిళనాడు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యం దిశగా పయనించేందుకు వీలుగా మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తమిళనాడు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2022 ఆగస్టు 11వ తేదీ కలైవానర్ అరంగంలో అవగాహన కార్యక్రమం జరిగిందన్నారు. ప్రస్తుత 2024 సంవత్సరం జూన్ వరకు మొత్తం 4.522 కేసులను పోలీసులు నమోదు చేసి, 7.123 మంది నిందితులను అరెస్టు చేశారన్నారు. అలాగే, 11.081 కేజీల గంజాయి, 74.016 మత్తుమాత్రలు, 283.70 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సారథ్యంలో కూడా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విశేషంగా కృషి చేసిన తేని జిల్లా ఎస్పీ శివప్రసాద్, సేలం సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథన్, చెన్నై సెంట్రల్ విజిలెన్స్ ఎస్ఐ రాజ్ కుమార్, మదురై జిల్లా ఒత్తకడై ట్రాఫిక్ ఎస్ఎస్ఐ అరుణ్, రామనాథపురం జిల్లా ఆర్ఎస్ మంగలం హెడ్ కానిస్టేబుల్ దురైలకు ముఖ్యమంత్రి స్టాలిన్ సీఎం మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ్‌దాస్ మీనా, అడిషనల్ చీఫ్ సెక్రటరీ ధీరజ్ కుమార్, డీజీపీ శంకర్ జీవాల్, శాంతిభద్రతల విభాగం ఏడీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం, చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీజీపీ అమల్‌రాజ్ సహా పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ స్మారక జ్యోతి యాత్ర ప్రారంభం


జ్యోతి యాత్రను ప్రారంభిస్తున్న టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్యారీస్, ఆగస్టు 12: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ స్మారక జ్యోతి యాత్రను సోమవారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి ప్రారంభించారు. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లోని రాజీవ్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం చెన్నై పశ్చిమ జిల్లా పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎంఎస్ ద్రవ్యం అధ్యక్షతన ఈ యాత్ర కదిలింది. రోడ్డు మార్గంలో ఐదు వాహనాల్లో 30 మంది పలు రాష్ట్రాల మీదుగా ప్రయాణం చేస్తారు. ఈ నెల 20వ తేది రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేలకు ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ స్మారక జ్యోతి అప్పగిస్తారు. యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా సాంకేతికాభివృద్ధి జరిగిందంటే అది రాజీవ్ పుణ్యమేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆర్.సురేష్‌కుమార్, ఎ.తీర్థి, మోహన్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షాలు కురిసినా చెన్నైకి వరద ముప్పు లేదు

● మంత్రి సుబ్రమణ్యం


పెరుంగుడి ప్రాంతంలో వాననీటి సంరక్షణ కాలువ పనుల ప్రారంభోత్సవం మంత్రి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే అరవింద్ రమేష్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 12 : రాజధాని నగరంలో 20 సెంమీలకు పైగా కుండపోత వర్షాలు కురిసినా వరదముప్పు ఉండదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం అన్నారు. స్థానిక ఆలందూరు, పెరుంగుడి, చోళింగనల్లూరు కార్పొరేషన్ జోన్ల పరిధిలోని కోవలంలో రూ.666.32 కోట్లతో నిర్మించనున్న భారీ వాననీటి సంరక్షణ కాలువ నిర్మాణ పనులను సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. అదే సమయంలో పెరుంగుడిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరవింద్ రమేష్, మంత్రి ఎం. సుబ్రమణ్యం, జోన్ ఛైర్మన్ ఎస్వీ చంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ చరిత్రలో ఇదివరకెన్నడూ లేని స్థాయిలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఒకే రోజున రూ.2వేల కోట్ల విలువైన పథకాలకు శంకుస్థాపన చేశారన్నారు. ఈ పనులు అందుబాటులోకి వస్తే రాబోవు రోజులలో కురిసే భారీ వర్షాల వల్ల నగరంలో వరద ముప్పు అనే సమస్యే తలెత్తదని స్పష్టం చేశారు.



స్థానిక ఈగ థియేటర్ జంక్షన్‌లో విద్యార్థుల నృత్యం - ట్రాఫిక్ పోలీసుల అవగాహన ప్రచారం

ప్రమాదరహిత 'చెన్నై'

● సాంస్కృతిక కార్యక్రమాలతో అవగాహన

పెరంబూర్, ఆగస్టు 12: రాజధాని నగరం చెన్నైని ప్రమాదరహిత నగరంగా తీర్చిదిద్దేలా గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, సిగ్నల్స్ పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం సహా పలు రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారికి ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నారు. అలాగే, వాహన చోదకులకు సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించేలా తాజాగా 'జీరో యాక్సిడెంట్ డే' పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా అన్నా రోటరీ, ఈగ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు రోడ్డు నిబంధనలతో రూపొందించిన పాటలు, స్లోగన్స్ చేస్తూ ఆదివారం సాయంత్రం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పీక్ అవర్స్‌గా పిలిచే సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు చిన్నారులు, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అవగాహన ప్రచారం చేపట్టారు. ఈ విషయమై ఏసీపీ ఆర్.సుధాకర్ బాబు మాట్లాడుతూ ప్రమాదరహితంగా రాజధాని నగరాన్ని తీర్చిదిద్దేలా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. పీక్ అవర్స్‌లో సిగ్నల్స్ వద్ద నిలిచిన వాహనచోదకులకు ఒత్తిడి తగ్గించడం, ప్రశాంతత చేకూర్చడం తదితరాల కోసం ఈ ప్రదర్శనలు నిర్వహించామన్నారు. వాహనచోదకులు కూడా ట్రాఫిక్ పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించి వాహనాల నడిపితే ప్రమాదరహిత నగరంగా చెన్నైని రూపొందించవచ్చని ఆయన కోరారు.

శివం హాస్పిటల్‌లో 82 యేళ్ల వృద్ధురాలికి తుంటి మార్పిడి శస్త్రచికిత్స


శస్త్రచికిత్స చేసుకున్న మహిళతో డాక్టర్ వి.శివకుమార్ తదితరులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): స్థానిక శివం ఆస్పత్రిలో చిత్ర అనే 82 యేళ్ల వృద్ధురాలికి తుండి మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ వి. శివకుమార్ తెలిపారు. 13 యేళ్ల క్రితం ఆమె తుంటి ఎముక దెబ్బతినటంతో శస్త్ర చేసుకున్నారని గత ఆరు మాసాలుగా తుంటి ఎముక ప్రాంతంలో నొప్పులు అధికమై నడవలేని స్థితికి చేరుకున్నారు. తమ ఆస్పత్రిలో వైద్యనిపుణులు ఆమెను పరీక్షించి తన నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా జరిపినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆమెకు ఫిజియోథెరపీ చేస్తున్నామని నెల రోజుల తర్వాత ఆమె ఎలాంటి నొప్పులు లేకుండా నడువగలుగుతారని చెప్పారు.


చెన్నైలో ప్రముఖ జ్యోతిష్యుడు ఏఎం రాజగోపాలన్ ఆశీస్సులందుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

హృద్యంగా సాగిన 'రాము' భక్తి సంగీత విభావరి



గానం చేస్తున్న రాము, సత్యవాణి - సంగీత విభావరికి హాజరైన ప్రముఖులు, నగరవాసులు

వేళచ్చేరి, ఆగస్టు 12 : స్థానిక టి.నగర్ పీఆర్సీసీ సెంటినరీ హాలులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'రాము'భక్తి సంగీత విభావరి కార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా సాగింది. ప్రతినెలా రెండో ఆదివారం ఈ హాలులో భక్తి సంబంధిత కార్యక్రమాలు జరుగుతాయి.. 'ఆంధ్రా బాలు'గా పేరొందిన యువసినీ నేపథ్యగాయకుడు రాము తనగానంతో శ్రోతలను తన్మయం చేశాడు. జ్యోతిప్రజ్వలన అనంతరం ట్రస్టీ బాలాజీ గాయకుడు రాముని సభకు పరిచయం చేస్తూ దేశ, విదేశాల్లో రాము 4000లకు పైగా పాటలు పాడారని, 1500 దాకా ఆల్బమ్స్ రూపొందించారని. 250 పైచిలుకు తెలుగు, తమిళ సినిమాల్లో పాటలు పాడారని, బాలు గొంతుతో సౌమ్యత ఉన్నందున బాలుగారే ఒక సందర్భంగా తమ ఇద్దరి గళాలు ఒకేలాగా ఉంటాయని పేర్కొన్నట్లు వివరించారు. తన భక్తి సంగీత విభావరికి 'జయజయ శుభకర వినాయక' అంటూ గణపతి ప్రార్థనతో రాము శ్రీకారం చుట్టారు. 'అంతా రామమయం' అంటూ రాముగానం చేసిన రామదాసు కీర్తనకు అందరూ భక్తిభావంతో తన్మయులైనారు. 'నిగమ నిగమాంత వర్ణిత' అనే అన్నమయ్య కీర్తనను రాము, సత్యవాణి జంటగా ఆలాపించారు. చివరగా 'దొరకునా ఇటువంటి సేవ' అంటూ ఇద్దరూ ఆర్తితో గానం చేసిన ఆ పాటకు అందరూ పరవశులయ్యారు. దాదాపు 2 గంటలకు పైగా జరిగిన రాము భక్తి సంగీత విభావరి కార్యక్రమం శ్రోతలను ఎంతో ఆనందింపజేసింది. కార్యనిర్వాహకులు గాయకులను సన్మానించారు. చివరగా ట్రస్ట్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన విందుభోజనంతో కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

లైట్‌హౌస్ వద్ద రూ.14.93 కోట్లతో చేపల మార్కెట్

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



మార్కెట్‌లోని ఓ చేపల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మైలాపూరు శాసనసభ్యుడు డి. వేలు - చేపల దుకాణం వద్ద నిలిచిన మహిళా లబ్ధిదారులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెరీనాబీచ్ లైట్‌హౌస్ సమీపం లూప్‌రోడ్డులో రూ.14.93 కోటతో నిర్మించిన చేపల మార్కెట్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అదే సమయంలో ఆ ప్రాంతం వద్దనున్న మైలాపూరు శాసనసభ్యుడు డి. వేలు ఆ మార్కెట్‌లో ఓ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. బీచ్ లూప్ రోడ్డు మీదుగా ప్రస్తుతం పట్టినంబాక్కంకు సిటీ బస్సులను నడుపుతున్నారు. దీంతో ఈ కొత్త మార్కెట్‌లో చేపల అమ్మకాలు బాగా పుంజుకుంటాయని దుకాణాలు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.